పచ్చిరొట్ట విత్తనాలు లేనట్టే..!

- చేతులెత్తేసిన కూటమి సర్కార్
- ఏపీ సీడ్స్‌లో స్టాక్ లేదంటున్న అధికారులు

పెడన: రైతులు తమ పంటల నుంచి అధిక దిగుబడులు కోసం, ఎరువులు వాడకాన్ని తగ్గించుకోవడానికి, భూసారం పెంచుకోవడానికి పచ్చరొట్ట విత్తనాలు వేసుకోవడం పరిపాటి. ప్రతి ఏటా తొలకరి జల్లులకు మెట్ట దుక్కులు దున్ని పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ, పిల్లిపెసర వంటివి వేయడం జరుగుతుంది. అయితే ప్రస్తుతం కూటమి సర్కార్ వాటిని కొన్ని చోట్ల అరకొరగా అందించి, మరికొన్ని చోట్ల అసలు ఇవ్వకుండా చేతులు దులుపుకొంది. దీంతో రైతులు గగ్గోలు పెడుతున్నారు. మరోపక్క క్షేత్రస్థాయిలోని రైతు సేవా కేంద్రాల్లో విధులు నిర్వహించే వీఏఏలు, ఎంపీఈవోలు పచ్చిరొట్ట విత్తనాలు వస్తాయని రైతులకు చెబుతుండటం విశేషం. కూటమి ప్రభుత్వం వరి విత్తనాలను అయినా అందిస్తోందో లేదోననే సందేహాలను రైతులు వ్యక్తం చేస్తున్నారు.


పెడన మండలం చోడవరం వద్ద మెట్ట దుక్కులు దున్నుతున్న రైతు

విత్తనాల కోసం ఎదురుచూపులు

పెడన మండలానికి 175 క్వింటాళ్ల జీలుగ, 170 పిల్లిపెసర విత్తనాలు అవసరమని తెలియజేస్తూ జిల్లా ఉన్నతాధికారులకు ఇండెంట్ పెట్టారు. అలాగే బంటుమిల్లి మండలానికి 300 క్వింటాళ్ల జీలుగ విత్తనాలు పెడితే 60 క్వింటాళ్లు మాత్రమే వచ్చాయి. ఇక కృత్తివెన్నులో జీలుగ వంద క్వింటాళ్లకు 50 క్వింటాళ్లు, జనుము పది క్వింటాళ్లకు 5 క్వింటాళ్లు వచ్చాయి. మిగిలిన విత్తనాలు వస్తాయా? రావా? అనేది ప్రశ్నార్థకమే. పచ్చిరొట్ట విత్తనాలు వస్తాయో.. రావోనని రైతులు ఎదురు చూస్తున్నారు.

వస్తాయో రావో..



గత ఐదేళ్లుగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అందేవి. ఇప్పుడు పచ్చిరొట్ట విత్తనాల కోసం ఎదురుచూడాల్సిన దుస్థితి వచ్చింది. అదును చూసి రైతులు పచ్చిరొట్ట విత్తనాలను సిద్ధం చేసుకుని రెడీగా ఉంటారు. అసలు వస్తాయో రావో కూడా తెలియని పరిస్థితి నెలకొంది.

– గరికిపాటి వెంకట రామానాయుడు, పెనుమల్లి

అధికారులు స్పష్టత ఇవ్వాలి



రైతు సేవా కేంద్రాల ద్వారా రైతులకు అవసరమైన విత్తనాలను అందించాల్సిన వ్యవసాయశాఖ ఉదాసీనత విడనాడాలి. రైతులకు ముందుగా ఏం కావాలో తెలుసుకుని వాటిని అందించాలి. అదును దాటిన తర్వాత అరకొర విత్తనాలను సరఫరా చేస్తే ప్రయోజనం ఉండదు. కాబట్టి ముందుగానే సబ్సిడీపై విత్తనాలు అందించాలి.

– వన్నెంరెడ్డి మహంకాళరావు, రైతు, పెడన

నివేదికలు పంపించాం



మండలానికి కావాల్సిన విత్తనాలను ఇండెంట్ పెట్టడం జరిగింది. సమారు 345 క్వింటాళ్ల విత్తనాలు అవసరమని నివేదికలు పంపించాం. ఉన్నతాధికారులు ఏపీ సీడ్స్‌లోనే స్టాక్ లేదంటున్నారు. ఇక రావేమోననే సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అవి ఎప్పుడు వస్తాయా అని రైతులు కూడా ఎదురు చూస్తున్నారు.

– నూరున్నీసా, ఇన్‌ఛార్జి ఏఓ, పెడన

క్లుప్తంగా

నేత్ర, శరీర దానం



చల్లపల్లి: మండలంలోని నిమ్మగడ్డ గ్రామానికి చెందిన లీలాకుమారి బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతిచెందారు. ఆమె కోరిక మేరకు ఆమె మేనల్లుడు మాలెంపాటి చక్రధర చౌదరి, జ్యోతి, బంధువు సూర్యదేవర నాగేశ్వరరావులు లీలాకుమారి నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి, శరీరాన్ని పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ కళాశాలకు నాగాయలంకకు చెందిన సుదర్శి మానవతా సేవా సంస్థ ద్వారా దానం చేశారు.

సాగరతీరంలో వాలీబాల్ పోటీలు



కోడూరు: హంసలదీవి సాగరతీరంలో పాలకాయతిప్ప కోస్టల్ సెక్యూరిటీ పోలీస్‌స్టేషన్ ఆధ్వర్యాన బుధవారం వాలీబాల్ పోటీలను నిర్వహించారు. మెరైన్ సీఐ సురేష్‌రెడ్డి పర్యవేక్షణలో తీరప్రాంత గ్రామాల్లోని యువకులకు ఈ పోటీలు జరిపారు. కోడూరు, నాగాయలంక మండలాల్లోని మత్స్యకార గ్రామాల యువకులు పోటీల్లో ఉత్సాహంగా పాల్గొన్నారు. డాల్ఫిన్ బాయ్స్ జట్టు, షార్క్ ఫైటర్స్ జట్టు మధ్య జరిగిన ఫైనల్ పోటీల్లో డాల్ఫిన్ బాయ్స్ జట్టు విజేతగా నిలిచింది. విజేతలతో పాటు రన్నర్స్‌గా నిలిచిన జట్టుకు మెమెంటోలు, ప్రశంసాపత్రాలను అందించారు. మెరైన్ ఎస్ఐలు పూర్ణమాధురి, ఉజ్వల్‌కుమార్, సిబ్బంది, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

నూతన వధూవరులకు ఆశీర్వాదం

చల్లపల్లి: మండలంలోని లక్ష్మీపురం గొడపాలెంకు చెందిన నూతన వధూవరులు పరసా బాలచంద్, ఉమామహేశ్వరీలను వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం కలిసి ఆశీర్వదించారు. ఇద్దరూ అన్యోన్యంగా ఆదర్శవంతమైన దంపతులుగా జీవించాలని ఆకాంక్షించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ(నాని), నాయకులు వెనిగళ్ల తారక జగదీష్, యడ్ల జగదీష్, భాగ్యారావు, కుటుంబరావు, బాబీ, కొల్లూరు ముద్దుకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కరణం రాధాకృష్ణమూర్తికి పరామర్శ



చల్లపల్లి: ఘంటసాల గ్రామ కరణంగా పనిచేసిన ఘంటసాల రాధాకృష్ణమూర్తిని, చల్లపల్లి ఆర్ఐ కృష్ణమోహన్‌ను వైఎస్సార్ సీపీ అవనిగడ్డ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే సింహాద్రి రమేష్‌బాబు బుధవారం పరామర్శించారు. రాధాకృష్ణమూర్తి భార్య, కృష్ణమోహన్ మాతృమూర్తి అయిన విజయలక్ష్మి ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. సింహాద్రి రమేష్ రామానగరంలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ శీరం వెంకట సత్యనారాయణ(నాని), నాయకులు వెనిగళ్ల తారక జగదీష్, యడ్ల జగదీష్, జుజ్జువరపు భాగ్యారావు, మోదుమూడి కుటుంబరావు, చింతలమడ బాబీ, కొల్లూరు ముద్దుకృష్ణ, మోదుమూడి శ్రీనివాసరావు, కొమ్మన కోటేశ్వరరావు, శివరామ్, ముచ్చు శ్రీను, నాయుడు చంద్రశేఖర్(పెద్దారెడ్డి), ముచ్చు భాను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



పెడన/ చల్లపల్లి/ కోనేరుసెంటర్: మచిలీపట్నం, అవనిగడ్డ, పెడన నియోజకవర్గాల్లోని పలు ప్రభుత్వ కార్యాలయాల్లో బుధవారం దివంగత మాజీ ముఖ్యమంత్రి నందమూరి తారక రామారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం నందమూరి సేవలను, నటనా కౌశల్యాన్ని కొనియాడారు. కార్యక్రమాల్లో పలువురు ఉద్యోగులు, ఆయా కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

చెత్త సంపద కేంద్రం పరిశీలన

పులిగడ్డ(అవనిగడ్డ): మండలంలోని పులిగడ్డ పంచాయతీలో ఏర్పాటు చేసిన చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాన్ని ఈవోపీఆర్‌డీ అప్పల నరసమ్మ బుధవారం సర్పంచ్ దాసరి విజయ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. సంపద కేంద్రం వద్ద ఏర్పాటు చేసిన వానపాముల తొట్టెలను ఆమె పరిశీలించారు. కంపోస్ట్ ఎరువులపై రైతులకు అవగాహన కల్పించాలని సంబంధిత అధికారులకు సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బీ అనిత, సిబ్బంది పాల్గొన్నారు.

అభినవ మేల్కోటకు నూతన శోభ

మారుతున్న ఉల్లిపాలెం శ్రీమన్నారాయణుడి ఆలయ రూపురేఖలు


నిర్మాణంలో ఉన్న ఆలయ గాలిగోపురం


శ్రీమన్నారాయణ స్వామివారి దేవాలయం


11అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణుడు

కోడూరు: అభినవ మేల్కోటగా పేరుగాంచిన ఉల్లిపాలెం గోదా, రాజ్యలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామివారి ఆలయంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఉల్లిపాలెం గ్రామంలో 160 ఏళ్ల క్రితం పంచాంగం వంశీయులు శ్రీమన్నారాయణుడి ఆలయాన్ని నిర్మించారు. అయితే కాలక్రమేణా ఆలయం జీర్ణావస్థకు చేరడంతో 1998లో అష్టాక్షరీ పీఠాధిపతి త్రిదండి అష్టాక్షరీ సంపత్‌కుమార రామానుజీయర్ స్వామిజీ ఆలయాన్ని దత్తత తీసుకున్నారు. పాత ఆలయ స్థానంలో రూ.2 కోట్లతో నూతన ఆలయాన్ని నిర్మించి 2012లో 11 అడుగుల ఏకశిలా శ్రీమన్నారాయణుడిని, ఉపాలయాల్లో రాజ్యలక్ష్మి, గోదాదేవి అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఆలయంలో వైష్ణవ ఆగమ శాస్త్రబద్ధంగా పూజలను నిర్వహిస్తున్నారు.

వేగంగా అభివృద్ధి పనులు

ప్రస్తుతం అష్టాక్షరీ స్వామిజీ పర్యవేక్షణలో ఆలయంలో అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. ఆలయ ముందు భాగంలో సుమారు రూ.1.10కోట్లతో 44అడుగుల గాలిగోపురాన్ని నిర్మిస్తున్నారు. అలాగే ఆలయం చుట్టూ సుమారు ప్రహరీని నిర్మిస్తున్నారు. ఆలయ లోపల యాగశాలను సుందరంగా తీర్చిదిద్దుతున్నారు. ఆలయ వెనుక భాగంలో స్వామివారికి చెందిన మాగాణి భూముల్లో కోనేరు తవ్వేందుకు ఆలయ కమిటీ ప్రణాళిక రూపొందించింది. కోనేరు మధ్యలో జలనారాయణుడి విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం ఆలయంలో జరుగుతున్న అభివృద్ధి పనులు పూర్తి కాగానే ఈ కోనేరు నిర్మాణ పనులను ప్రారంభించనున్నట్లు ఆలయ కమిటీ తెలిపింది.

పంట బోదె ఆక్రమణల తొలగింపునకు సర్వే


రైతుల సమక్షంలో పంట బోదె సర్వే నిర్వహిస్తున్న అధికారులు

గూడూరు: రామరాజుపాలెం ప్రధాన కాలువ నుంచి ఆకుమర్రు, గొల్లపాలెం పంట పొలాలకు సాగునీరు సరఫరా చేసే పంటబోదె ఆక్రమణలు తొలగించడానికి రెవెన్యూ అధికారులు బుధవారం సర్వేకు శ్రీకారం చుట్టారు. పంట బోదె ఆక్రమణలకు గురవ్వడంతో తమ పంట పొలాలకు సాగునీరు సక్రమంగా అందడం లేదంటూ ఆయకట్టు రైతులు తహసీల్దారు డి.రాజ్యలక్ష్మికి ఫిర్యాదు చేశారు. దీనిపై స్పందించిన తహసీల్దారు పంట బోదె సమగ్ర సర్వే నిర్వహించాలని మండల సర్వేయర్ మురళీకృష్ణను ఆదేశించారు. దీంతో పంటబోదెకు ఇరుపక్కలా ఉన్న 20 మంది రైతులకు నోటీసులు ఇచ్చి సర్వే చేపట్టారు. రైతుల సమక్షంలో పంట బోదె హద్దులను నిర్ధారించారు. కార్యక్రమంలో ఆర్ఐ ఝాన్సీలక్ష్మి, వీఆర్వో అడపా నరేష్, గ్రామ సర్వేయర్ ఎస్ఎం నాసీర్ తదితరులు పాల్గొన్నారు.

యోగాతో మానసిక ఒత్తిడి దూరం


గూడూరులో యోగాసనాలు సాధన చేస్తున్న ఉద్యోగులు


మోపిదేవిలో ర్యాలీ నిర్వహిస్తున్న ఉద్యోగులు

పెడన: యోగాతో మానసిక, శారీరక ఒత్తిళ్లను తగ్గించుకోవచ్చని ఎంపీడీవో అరుణకుమారి అన్నారు. మార్కెట్ యార్డు నుంచి పట్టణంలోని బంటుమిల్లి రోడ్డు సెంటర్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కమిషనర్ ఎంగోపాలరావు, పీఆర్ ఏఈ ధర్మయ్య, పెడన పీహెచ్‌సీ వైద్యురాలు మీనాక్షి దేవి పాల్గొన్నారు. కాగా ఈ నెల 27 నుంచి 31వ తేదీ వరకు పెడన మార్కెట్ యార్డులో జరిగిన యోగా క్లాసులు గురువారం నుంచి ఎంపీడీవో కార్యాలయంలోనే జరుగుతాయని ఆమె తెలిపారు.

గూడూరు: యోగాంధ్ర–2025లో భాగంగా బుధవారం స్థానిక జెడ్పీ హైస్కూల్‌లో యోగా శిక్షణ నిర్వహించారు. అనంతరం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా మచిలీపట్నం డీవైఈఓ బీఎస్‌సీ శేఖర్‌సింగ్ మాట్లాడుతూ యోగా సాధన వల్ల చేకూరే ప్రయోజనాలు ప్రతిఒక్కరూ గుర్తించాలని కోరారు. యోగా ట్రైనర్ మత్తి అరుణ, సచివాలయ ఉద్యోగులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రజల్లో అవగాహన పెంచాలి

చల్లపల్లి: ప్రభుత్వ ఆశయాలకు అనుగుణంగా నిత్యం యోగా సాధన చేస్తూ ప్రజల్లో అవగాహన పెంచాలని ఎంపీడీవో వి.రవిశంకర్ ట్రైనర్లకు సూచించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహిస్తున్న యోగా ట్రైనర్ల శిక్షణ కార్యక్రమాలను బుధవారం ఆయన పరిశీలించారు. యోగా ట్రైనర్లు, గురువులు రామకృష్ణప్రసాద్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.


చల్లపల్లిలో యోగా శిక్షణలో ట్రైనీలు

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం

మోపిదేవి: యోగా సాధనతో సంపూర్ణ ఆరోగ్యం పొందుతారని ఎంపీడీవో జే స్వర్ణభారతి తెలిపారు. మండల పరిషత్ కార్యాలయం నుంచి అధికారులు, ప్రజాప్రతినిధులతో మోపిదేవి బస్టాండ్ వరకు బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, మాజీ సర్పంచ్ రావి నాగేశ్వరావు, తహసీల్దార్ శ్రీవిద్య, ఆయుర్వేద మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రవినాథ్, మండల కోఆప్షన్ సభ్యుడు రంగారావు పాల్గొన్నారు.

చిత్తశుద్ధిలేని యోగా తరగతులు

బంటుమిల్లి: మండల పరిషత్ కార్యాలయంలో గత నాలుగు రోజులుగా ఉద్యోగులకు జరుగుతున్న యోగా శిక్షణ తరగతుల్లో చిత్తశుద్ధి లేదనే విమర్శలు వస్తున్నాయి. బుధవారం తరగతుల్లో భాగంగా యోగా అనంతరం ర్యాలీ చేశారు. ఈ ర్యాలీకి కొంత మంది ప్రభుత్వ అధికారులు, సిబ్బంది డుమ్మా కొట్టారు. దీంతో యోగా శిక్షణ తరగతులు మొక్కుబడి కార్యక్రమంగా మారిందన్న ఆరోపణలు వస్తున్నాయి.

వైభవంగా విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం

మోపిదేవి: మండల కేంద్రం మోపిదేవి 11వ నంబర్ కాలువ పక్కన నూతనంగా నిర్మించిన ఆలయంలో శ్రీఅభయాంజనేయ స్వామివారి విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవం బుధవారం వైభవంగా నిర్వహించారు. జనార్దన శివాచార్య స్వామీజీ బృందం నేతృత్వంలో వేదమంత్రాల మధ్య స్వామివారి విగ్రహ ప్రతిష్ఠ శాస్త్రోక్తంగా జరిగింది. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం అన్నప్రసాద వితరణ నిర్వహించారు. ఎంపీపీ రావి దుర్గావాణి, నాగేశ్వరావు దంపతులు, స్థానిక తహసీల్దార్ శ్రీవిద్య, ఎస్ఐ సత్యనారాయణ, రెవెన్యూ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

నేడు డయల్ యువర్ డీఎం

అవనిగడ్డ: స్థానిక ఆర్టీసీ డిపో కార్యాలయంలో గురువారం డయల్ యువర్ డీఎం కార్యక్రమం నిర్వహించనున్నట్లు డిపో మేనేజర్ కే హనుమంతరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11.30 నుంచి మధ్యాహ్నం 12.30గంటల మధ్య జరిగే ఈ కార్యక్రమానికి సలహాలు ఇవ్వదలచిన వారు 99592 25466 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు.

సమయపాలన లేని ఫార్మసిస్ట్



బంటుమిల్లి: మండలంలోని పెదతుమ్మిడి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫార్మసిస్ట్ సమయపాలన పాటించడం లేదన్న ఆరోపణలు వస్తున్నాయి. బుధవారం వైరల్ జ్వరాలతో చికిత్స కోసం వెళ్లిన రోగులు వైద్యాధికారి కే సువర్చల మందుల చీటీ రాసిన మందులు ఇచ్చేవారు లేక దాదాపు 11 గంటల దాకా పడిగాపులు పడ్డారు. ఫార్మసిస్ట్ ప్రవర్తనపై వైద్యాధికారి గతంలో అనేకసార్లు మెమోలు ఇచ్చినప్పటికీ వాటిని బేఖాతరు చేసిందే కాని పద్ధతి మార్చుకోలేదని సిబ్బంది చెబుతున్నారు. ఆలస్యంగా రావడమేకాక రోగులు అడిగితే మీకు సమాధానం చెప్పనవసరం లేదని నిర్లక్ష్యంగా జవాబు ఇచ్చినట్లు రోగులు తెలిపారు. దీనిపై పీహెచ్‌సీ వైద్యాధికారిణి కే సువర్చల మాట్లాడుతూ రోగులు చేసిన ఫిర్యాదుపై జిల్లా వైద్యాధికారిని కలిసి విధులకు రావాలని హెచ్చరించినట్లు తెలిపారు.

సినిమా థియేటర్ల తనిఖీ

చల్లపల్లి: చల్లపల్లిలో ఉన్న సాగర్, కోమలా థియేటర్లలో సౌకర్యాలు బాగానే ఉన్నాయని తహశీల్దార్ డి.వనజాక్షి పేర్కొన్నారు. బుధవారం రెవెన్యూ అధికారులు సినిమా థియేటర్లలో తనిఖీలు నిర్వహించారు. రెండు థియేటర్లను లోపల, బయట మొత్తం పరిశీలించారు. అనంతరం తహసీల్దార్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తనిఖీలు నిర్వహించినట్లు తెలిపారు. కోమలా, సాగర్ రెండు థియేటర్లలో ఏసీలు పనిచేయడం లేదని, అలాగే వ్యాపార దుకాణాలు తెరవడంలేదని పేర్కొన్నారు. ఇవి మినహా మిగిలిన అన్ని అంశాలు ప్రభుత్వ నిబంధనల ప్రకారం సక్రమంగానే ఉన్నాయని తెలిపారు.

చలో విజయవాడ విజయవంతం చేయండి

బంటుమిల్లి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో వచ్చేనెల 5వ తేదీన నిర్వహించనున్న ఛలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సంఘ నాయకులు కోరారు. స్థానిక వ్యవసాయ, విద్య, మండల పరిషత్ తదితర కార్యాలయాల్లో ప్రభుత్వ అధికారులను, సిబ్బందిని కలిసి అసోసియేషన్ నాయకులు కరపత్రాలు అందజేసి గోడ పత్రికలు ఆవిష్కరించారు. అసోసియేషన్ కృష్ణా యూనిట్ జాయింట్ కార్యదర్శి గంటా రామకృష్ణ, బంటుమిల్లి తాలూకా యూనిట్ అధ్యక్షుడు డాకర్ ఎస్ సుకాంత్, అసోసియేట్ అధ్యక్షుడు జీ శివరామకృష్ణ, పలు ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు సమర్థవంతంగా చేపట్టాలి

అవనిగడ్డ: నియోజకవర్గంలో చేపట్టిన పంటకాలువలు, డ్రెయినేజీ పనులు సమర్థవంతంగా నిర్వహించాలని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అధికారులను ఆదేశించారు. స్థానిక ఎమ్మెల్యే కార్యాలయంలో బుధవారం అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలో రూ. 2.25 కోట్లతో చేపట్టిన పనులను సకాలంలో పూర్తి చేయాలని చెప్పారు. కృష్ణా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ దేవనబోయిన వెంకటేశ్వరరావు, డీసీ ఛైర్మన్లు బండ్రెడ్డి నాగ మల్లికార్జునరావు, భానుప్రకాష్, ఇరిగేషన్, డ్రెయినేజీ ఈఈ పాల్గొన్నారు.

వేకనూరులో వికసిత కృషి సంకల్ప అభియాన్

అవనిగడ్డ: మండలంలోని వేకనూరు గ్రామంలో రైతులకు సాగు సాంకేతి పరిజ్ఞానాన్ని అందించేందుకు గురువారం వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రం సమన్వయకర్త డాక్టర్ సుధారాణి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మట్టిన మూనా పరీక్షలు, నూతన వంగడాల ఎంపిక, యాంత్రీకరణ, పంటల సాగు యాజమాన్య పద్ధతులు, నూతన సాంకేతిక పరిజ్ఞానం, పాడి పశువులు యాజమాన్య పద్ధతులు, వ్యవసాయంలో డ్రోన్ల వినియోగం, పలు సబ్సిడీ పథకాల ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తామని పేర్కొన్నారు. రైతులు ఈ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

పౌరాణిక కథలు యువత తెలుసుకోవాలి

కేయూ వీసీ రాంజీ


సమావేశంలో మాట్లాడుతున్న కేయూ వీసీ రాంజీ

మచిలీపట్నంటౌన్: భారత పౌరాణిక కథలను నేటి యువత తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని కృష్ణా యూనివర్సిటీ ఉపకులపతి డాక్టర్ కూన రాంజీ పేర్కొన్నారు. సాహితీ సుధ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక బచ్చుపేట మహతి లలిత కళావేదికపై దేవర్షి నారద జయంతి ఉత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా హాజరైన వీసీ రాంజీ మాట్లాడుతూ నేటి యువతకు భారత ఇతిహాసాల ఇతివృత్తాలు తెలియడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యువతకు వీటిపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. అనంతరం సీనియర్ పాత్రికేయులు ముదిగొండ శాస్త్రి, పైడిపాముల అశోక్‌కుమార్, కారుమూరి రాజేంద్రప్రసాద్, సామా సునీల్‌లను వీసీ సన్మానించారు. కార్యక్రమంలో పెడన ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కాళ్లకూరి చంద్రశేఖర్, హిందూ కళాశాల విశ్రాంత అధ్యాపకుడు డాక్టర్ బొమ్మరాజు సారంగపాణి, ఈసీఈయూ మచిలీపట్నం డివిజన్ ప్రధాన కార్యదర్శి జీ కిషోర్‌కుమార్, చంద్రశేఖర్, వైద్యుడు బీ ధన్వంతరి ఆచార్య, న్యాయవాది వేణు, గంధ్రపు శీనయ్య మాష్టారు, కొండమంచిలి చంద్రశేఖర్, ముప్పిడి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేంద్రియ ఎరువులతో రైతులకు మేలు


సదస్సులో మాట్లాడుతున్న జిల్లా ఏఓ మనోహరరావు

ఘంటసాల: సేంద్రియ ఎరువుల వాడకం ద్వారా రైతులకు మేలు జరుగుతుందని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌వీఎస్ మనోహరరావు పేర్కొన్నారు. ఘంటసాల కృషి విజ్ఞాన కేంద్రంలో భారత ప్రభుత్వ ప్రజారంగ సంస్థ మద్రాస్ ఫెర్టిలైజర్స్ లిమిటెడ్ రీజనల్ మేనేజర్ ఎస్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సదస్సును బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మనోహర్ మాట్లాడుతూ జీవ ఎరువులతో పాటు సేంద్రియ, పచ్చిరొట్ట ఎరువుల ప్రాధాన్యత, పంట మార్పిడి తదితర విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. రీజనల్ మేనేజర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ భారత ప్రభుత్వం ప్రవేశపెట్టిన పీఎం ప్రనామ్ కార్యక్రమాన్ని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయశాఖ డీడీ కే జ్యోతిర్మయి, కేవీకే ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ డీ సుధారాణి, ఏడీఏ ఎస్ శ్యామల, ఏఓ కే మురళీ కృష్ణ, టెక్నికల్ ఏఓ పద్మజ, కేవీకే శాస్త్రవేత్తలు పాల్గొన్నారు.

పార్టీ కార్యకర్తను పరామర్శించిన పేర్ని కిట్టు


పార్టీ కార్యకర్త రజనీకాంత్‌ను పరామర్శిస్తున్న పేర్ని కిట్టు

పెదపట్నం(మచిలీపట్నం రూరల్): వైఎస్సార్ సీపీ కార్యకర్త ఊర రజనీకాంత్‌ను మచిలీపట్నం నియోజకవర్గ కన్వీనర్ పేర్ని కృష్ణమూర్తి(కిట్టు) పరామర్శించారు. మండలంలోని పెదపట్నంకి చెందిన పార్టీ కార్యకర్త రజనీకాంత్ తల్లి ఊర వజ్రం(60) అనారోగ్యంతో విజయవాడలో చికిత్స పొందుతూ మంగళవారం రాత్రి మృతిచెందారు. విషయం తెలుసుకున్న పేర్ని కిట్టు బుధవారం పెదపట్నం గ్రామానికి వెళ్లి భర్త ఆశీర్వాదం, కుమారుడు రజనీకాంత్‌ను పరామర్శించి సంతాపం తెలిపారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నార్త్ మండల కన్వీనర్ మట్టా నాంచారయ్య, కేడీసీసీ బ్యాంకు మాజీ డైరెక్టర్ బాలజేసు, నాయకులు డేవిడ్ రోజ్, పాతపాటి పండు, పీతల నాని, ఇంతేటి ప్రదీప్ తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక గ్రంథాలయం ప్రారంభం

తాడేపల్లి(ఘంటసాల): ఘంటసాల మండలం తాడేపల్లి గ్రామంలోని సద్గురు మళయాళస్వామి ఆశ్రమం, వృద్ధాశ్రమ ప్రాంగణంలో రూ.9 లక్షలతో నిర్మించిన దోనేపూడి మునీశ్వరమ్మ ఆధ్యాత్మిక గ్రంథాలయాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ గ్రంథాలయం ఇటు వేద పాఠశాల విద్యార్థులకు, అటు ప్రజలకు ఆధ్యాత్మిక చింతనకు ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు తుమ్మల చౌదరి బాబు, ఏఎంసీ ఛైర్మన్ తోట కనకదుర్గ, జెడ్పీ మాజీ వైస్ ఛైర్మన్ గొర్రెపాటి రామకృష్ణ, ఆశ్రమ ప్రతినిధులు మొవ్వ శ్రీరామమూర్తి, కోదండ రామయ్య తదితరులు పాల్గొన్నారు.

వీర సావర్కర్‌కు నివాళి

మచిలీపట్నంటౌన్: వీర సావర్కర్ జయంతి కార్యక్రమాన్ని నేతాజీ మిత్ర మండలి ఆధ్వర్యంలో బుధవారం స్థానిక గొడుగుపేటలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వక్తలు ధూళిపాళ శ్రీరామచంద్రమూర్తి, సూరిశెట్టి హరికృష్ణ మాట్లాడుతూ సావర్కర్ స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. సంఘ సంస్కరణల్లో ప్రసిద్ధుడని పేర్కొన్నారు. కూనపరెడ్డి బ్రహ్మయ్య, మైనంపూడి సాయిబాబు, విన్నకోట సుబ్బారావు, నల్లాని మురళీకృష్ణ, లింగం మోజెస్ తదితరులు పాల్గొన్నారు.